


గ్రూప్-2 పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం దాసన్నపేట, మే 19: గ్రూప్-2 మెయిన్స్‌కు సిద్ధమయ్యే జిల్లాకు చెందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టరు సందీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 20 తేదీ (సోమవారం) నుంచి 24 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తుత్తి నొక్కుడేనా?

- సీఎం బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా..
- ఇంకా పేదల ఖాతాల్లోకి జమకాని నిధులు
- పోలింగ్‌కు రెండు రోజులు ముందు హడావుడి
- తరువాత మరచిపోయిన సర్కారు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు





విజయనగరం (ఆంధ్రజ్యోతి) మే 19: పేదలను వైసీపీ సర్కారు మోసం చేసింది. సంక్షేమ పథకాలకు సీఎం జగన్ బటన్ నొక్కి నెలలు గడుస్తున్నా ఇంకా పేదల ఖాతాల్లోకి నగదు జమ కాలేదు. ఎన్నికల్లో గెలుపు కోసం పోలింగ్‌కు రెండు రోజుల ముందు పేదల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ప్రభుత్వ పెద్దలు హడావుడి చేశారు. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత వేయాలని ఈసీ ఆదేశించడంతో ప్రభుత్వం హైకోర్టును ఆదేశించింది. నగదు జమ చేసేందుకు కోర్టు ఒక్కరోజు మాత్రమే అవకాశం ఇచ్చింది. కానీ, ఆ ఒక్కరోజులో కొందరికే నగదు జమ చేశారు. మిగతా వారికి పోలింగ్ తరువాత ఇస్తామని చెప్పారు. అయితే, పోలింగ్ ముగిసి వారం రోజులు అవుతున్నా పేదల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. కల్యాణమస్తు, షాదీతోఫా, చేయూత, ఇన్‌పుట్ సబ్సిడీ, ఈబీసీ నేస్తం, విద్యాదీవెన పథకాలకు ఇప్పటి వరకూ రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇది పేదలను మోసగించటమే అంటున్నాయి ప్రతి పక్షాలు. ఈ పథకాలకు సంబంధించి సీఎం జగన్ రెండు నెలల కిందట బటన్ నొక్కారు. కానీ ఇప్పటికీ ఖాతాల్లోకి డబ్బులు జమకాకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బటన్ నొక్కినప్పుడల్లా తమను కూలి పనులు మాన్పించి మీటింగ్‌లకు తీసుకెళ్లిన నాయకులు ఇప్పుడు నోరు మెదపడం లేదని మండిపడుతున్నారు. జగన్‌కు చెందిన మీడియాలో పెద్దఎత్తున బొమ్మలు వేస్తూ యాడ్‌లు చూసి మోసపోయామని గగ్గోలు పెడుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలలో డబ్బులు జమ అవుతాయని అనుకుంటే మే నెల ముగుస్తున్నా పైసా కూడా ఖాతాల్లోకి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు అంటే ఈ నెల 11, 12 తేదీల్లో డబ్బులను ఖాతాల్లో వేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. పథకం ప్రకారం ఎన్నికల తేదీ వరకు అట్టిపెట్టి పోలింగ్‌కు ఒకటి రెండు రోజులు ముందు జమ చేసి లబ్ధిపొందాలని అధికార పార్టీ ప్రయత్నించింది. దీనిని గుర్తించిన ఎన్నికల సంఘం నిధుల విడుదలను పోలింగ్ పూర్తయ్యాక చేయాలని ఆదేశించింది. ఇప్పుడు ఎన్నికలు పూర్తియినా ఎందుకు తమ ఖాతాల్లో నగదు జమకాలేదని జిల్లా మహిళలు వైసీపీ నేతలను ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఆసరా లబ్ధిదారుల్లో కొందరికి మాత్రమే సొమ్ము జమ అయింది. మిగిలిన పథకాల నగదు ఇంకా అందలేదు.

ఈబీసీ నేస్తం..

అగ్రవర్ణ కులాలకు చెందిన 40 నుంచి 60 ఏళ్ల పేద మహిళలకు ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు చెల్లించాల్సి ఉంది. మూడో విడతలో భాగంగా జిల్లాలో 5,546 మంది మహిళలకు రూ.8.31 కోట్లు రావల్సి ఉండగా ఇప్పటి వరకు వారి ఖాతాల్లోకి రూపాయి కూడా జమకాలేదు. సీఎం జగన్ బటన్ నొక్కి తమను మోసం చేశారని మహిళలు మండిపడుతున్నారు.

సున్నా వడ్డీ..

మహిళలు బ్యాంకే లింకేజి ద్వారా తీసుకున్న రుణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.3 లక్షల వరకు సున్నా వడ్డీ రాయితీ ఇవ్వాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం 7 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు ఇటీవల నాలుగో విడత వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ కింద జిల్లాలో సుమారు 38,222 సంఘాలకు రూ.66.2 కోట్లు వడ్డీ మాఫీ చేయాల్సి ఉంది. అయితే దీనికి సంబంధించిన నిధులకు గత ఏడాది జూలైలోనే జగన్ బటన్ నొక్కారు. కానీ కొంతమేర మాత్రమే జమ అయ్యాయి. ఇంకా రూ.16 కోట్లు రావల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు జమ చేయలేదు.

చేయూత ఏదీ..

మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చేయూత ఇస్తున్నట్లు జగన్ సర్కారు గొప్పలు చెబుతుంటుంది. 45ఏళ్లు దాటిన మహిళకు ప్రతి ఏటా రూ 18,750 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది మే నెల ముగుస్తున్నా ఇప్పటికీ మహిళల బ్యాంక్ ఖాతాల్లో నిధులు జమకాలేదు. దీంతో జగనన్న చేయూత ఏదీ అంటూ వారు నిట్టూర్చుతున్నారు.

పిడుగుపడి గొర్రెల కాపరి మృతి



అప్పలస్వామి (ఫైల్)

శృంగవరపుకోట రూరల్, మే 19: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బొబ్బిలి అప్పలస్వామి (25) ఆదివారం సాయంత్రం పిడుగుపడి మృతి చెందాడు. అప్పలస్వామి ఎప్పటిలాగే ఆదివారం ఉదయం 6 గంటలకు మేకలు తోలుకొని గ్రామంలో కంచిపాటి రాము క్వారీ సమీపంలో ఉన్న మెట్ట వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఆరుగంటల సమయంలో ఇంటికి మేకలు చేరుకున్నా అప్పలస్వామి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా మెట్టపై పిడుగుపాటుకు మృతిచెంది ఉన్నాడు. అప్పలస్వామికి తల్లిదండ్రులు, భార్య, ఏడాది కుమారుడు ఉన్నాడు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నేడు దాడితల్లి తొలేళ్లు ఉత్సవం



సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 19: బొబ్బిలితో పాటు పరిసర 12 గ్రామాల గ్రామదేవత దాడితల్లి సిరిమానోత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం జరగనుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గొల్లపల్లిలో దేశతల్లి వారోత్సవాలను వైభవంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, సాముగరిడీ, బిందెల డాన్స్, కోలాటం తదితర సాంస్కృతిక ప్రదర్శలు ఆకట్టుకున్నాయి. దాడితల్లి సిరిమానోత్సవం మంగళవారం నిర్వహించనున్నారు.

ఖరీఫ్‌కు కార్యాచరణ

- 46,530 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక
- 51,476 మెట్రిక్ టన్నుల ఎరువులు కూడా..



గంట్యాడ, మే 19: ఖరీఫ్ సాగుకు వ్యవసాయ శాఖ కార్యచరణ సిద్ధం చేసింది. అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రణాళిక తయారు చేసింది. ఇప్పటికే జిల్లాలో అకాల వర్షాలు కురవడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 94 వేల హెక్టార్లలో వరి, 10వేల హెక్టార్లలో మొక్కజొన్న, 4వేల హెక్టార్లలో నువ్వులు, 2వేల హెక్టార్లలో పత్తి, 400 హెక్టార్లలో గోగు, 4వేల హెక్టార్లలో చెరుకు సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరి విత్తనాలకు సంబంధించి ఎంటీయూ 1121 రకం 35,154 క్వింటాలు, ఎంటీయూ1224 రకం 3,146, సోనమసూరి 2,110, సాంబ మసురి 1,640, స్వర్ణ 810, ఎంటీయూ 1318 రకం 930, ఎంటీయూ 1064 రకం 2,500 క్వింటాల విత్తనాలను రైతులకు అందజేయడానికి వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. అలాగే పచ్చి రొట్ట విత్తనాలు 2,517 క్వింటాలు, మినుములు 90, పెసలు 50, వేరుశనగ 900, రాగులు 55, నువ్వులు 120 క్వింటాల విత్తనాలు పంపిణీ చేయనున్నారు. అలాగే, జిల్లాలో అన్ని రకాల పంటలకు 51,476 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగం పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఎరువులు అందజేయనున్నారు. యూరియా 26,662 మెట్రిక్ టన్నులు, డీఏపీ 11,164 టన్నులు, ఎంవోపీ 2,235 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 9,871టన్నులు, ఎస్ఎస్‌పీ 1545 టన్నులు సరఫరా చేయనుంది.

ఇసుక దందా

- చంపావతి, ఏడొంపుల గెడ్డలో అక్రమ తవ్వకాలు
- టైరు బండ్లలో తరలించి నిల్వ చేస్తున్న వైనం
- రాత్రుళ్లు వేరే ప్రాంతాలకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఎం.గుమడాం, లోగిస గ్రామాల సమీపంలో ఇసుక నిల్వలు

గజపతినగరం మే 19: మండలంలోని చంపావతి, ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుకు తరలిపోతున్నా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదలే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు ఎం.గుమడాం వద్ద ఉన్న ఏడుంపుల గెడ్డ నుంచి టైరు బండ్లతో ఎం.గుమడాం, తమ్మారాయుడుపేట లింగాలవలసకు ఇసుక తరలించి ఓ చోట నిల్వ చేస్తున్నారు. అలాగే చంపావతి నదిలో ఇసుకను తవ్వి పురిటిపెంట, గంగ చోళ్ల పెంట, లోగిస, తుమ్మికాపల్లి, కెంగువ తదితర గ్రామా ల్లోని పశువుల కళ్లాలవద్ద అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ఈ ఇసుకను రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. గతంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు జరిపి ఇసుక నిల్వలను గుర్తించి సంబంధిత స్థల యజమానికి నోటీసులు ఇచ్చేవారు. అనంతరం ఇసుకను స్వాధీనం చేసుకొనేవారు. తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌లో వేలం వేసేవారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోవడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇటీవల మండల శివారు గ్రామంలో నిల్వ చేసిన ఇసుకను రూ.3.50 లక్షలకు వేలం వేయాలని భావించారు. అయితే ఈ విషయం బహిర్గతం కావడంతో వేలం ప్రక్రియను విరమించుకున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చంపావతి నది, ఏడొంపులగెడ్డ పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకపై దాడులు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని మండలవాసులు కోరుతున్నారు.

కౌంటింగ్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి) మే 19: వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్‌కు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసుశాఖ ఇప్పటికే ముందస్తు చర్యలు చేపట్టింది. అన్ని డివిజన్లు, వార్డులు, గ్రామాల్లో సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులు ప్రజలతో సమావేశం నిర్వహించి ఓట్ల లెక్కింపు రోజు ఎటువంటి ఘర్షణలు పడవద్దని చెబుతున్నారు. ఎటువంటి గొడవలు, కవ్వింపు చర్యలు లేకుండా చూసే బాధ్యత మీదేనని ఆ గ్రామ, డివిజన్ పార్టీల నాయకులు, పెద్దలకు సూచిస్తున్నారు. కౌంటింగ్‌నకు ముందు, తరువాత ఎక్కడైనా వివాదాలు జరిగితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. అదే విధంగా మహిళలతో కూడా ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ పిల్లలను వివాదాల జోలికి పోనీ వ్వకుండా చూడాలని చెబుతున్నారు. టూటౌన్ సీఐ కోరాడ రామారావు శనివారం రాత్రి కొత్తపేట, యాదవ వీధిలోని ముఖ్య కూడళ్లల్లో మహిళలతో సమావేశం నిర్వహించి, ఈ మేరకు తాజా పరిస్థితిని వివరించారు. జూన్ 4 వరకూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులుగా తిరగరాదని సూచించారు. ఎక్కడైనా వివాదాలు జరిగితే వెంటనే పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

హాస్టళ్లలోనే ఉంటున్నాం

- ఎలాంటి ఇబ్బందులు లేవు
- కుటుంబ సభ్యులకు చెప్పిన కిర్గిస్థాన్‌లోని జిల్లా విద్యార్థులు

రాజాం రూరల్, మే 19: తామంతా బాగానే ఉన్నామని, ఎలాంటి ఇబ్బందులు లేవని, ప్రస్తుతం హాస్టళ్లలోనే ఉంటున్నామని కిర్గిస్థాన్ దేశంలో చదువుతున్న జిల్లా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు ఆదివారం సాయంత్రం ఫోన్ చేసి చెప్పారు. దీంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. రాజాం ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థులు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'కి అక్కడి పరిస్థితులను వివరించారు. భారత విద్యార్థులు ఎవరూ భయాందోళనకు గురికావద్దని, పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని, విద్యార్థులు బయటకు రావద్దని, సమస్యలు తలెత్తితే వెంటనే ఎంబసీని సంప్రదించాలని భారత రాయబార కార్యాలయం ఓ ఫోన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచింది. కాగా, విద్యార్థులను ఆదుకోవాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్‌కు శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు లేఖ రాశారు. కిర్గిస్థాన్‌లోని బిషేకేక్ పట్టణంలో బితుకుబితుకుమంటూ జీవనం సాగిస్తున్న రాష్ట్రానికి చెందిన సుమారు 2 వేల మంది వైద్య విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు ప్రారంభించాలని, వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా భారత రాయభార కార్యాలయం ద్వారా సహాయం అందించాలని ఆ లేఖలో కోరారు. అక్కడి అల్లరి మూకల బారిన పడకుండా, భద్రత కల్పించి వారంతా సురక్షితంగా ఉండేలా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. భారత ఎంబసీ ద్వారా వారిని అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

జేఎస్ఎల్ కార్మికుల వంటా వార్పు



నిరసన తెలుపుతున్న కార్మికులు

కొత్తవలస, మే 19 : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జేఎస్ఎల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం ఎదుట మూడో రోజు ఆదివారం కూడా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం కర్మాగారం ఎదుట వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. అవసరమైన బియ్యం, వంట సామగ్రిని టీడీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి రాము సమకూర్చారు. కార్మికులుకు వివిధ పార్టీల నాయకులు, కార్మిక సంఘాల నాయకులు సంఘీభావాన్ని తెలియజేస్తున్నారు. ఉత్తరాపల్లి సర్పంచ్ సింగంపల్లి గణేష్ ఆదివారం నిరసన శిబిరం వద్దకు వచ్చి కార్మికులకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. సోమవారం నాటి వంటావార్పు కార్యక్రమానికి అవసరమైన బియ్యం, సరుకులను తాను అందిస్తానని తెలిపారు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు నిరసన శిబిరం నుంచి వైదొలగే ప్రసక్తే లేదని కార్మికులు స్పష్టం చేశారు. కర్మాగారాన్ని ఎన్ని రోజులు మూసి ఉంటే అన్నిరోజులకు తమకు పూర్తి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

యాజమాన్యం స్పందన కోసం ఎదురుచూపు

స్థానిక జేఎస్ఎల్ కర్మాగార యాజమాన్య ప్రతినిధులు కార్మికుల డిమాండ్‌పై ఢిల్లీలో ఉన్న టాప్ మేనేజ్ మెంట్‌తో మాట్లాడి తమ వైఖరి సోమవారం చెప్తామని లాకౌట్ వేసిన రోజు వారు చెప్పిన విషయం తెలిసిందే. దీంతో సోమవారం ఎటువంటి నిర్ణయం వస్తుందోనని కార్మికులు ఎదురు చూస్తున్నారు. లాకౌట్ కారణంగా ఇక్కడ యూనిట్‌ను మూసేసినందున కార్మికులు అంగీకరిస్తే ఒడిశా రాష్ట్రంలో ఉన్న జిందాల్ సంస్థలో ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని యాజమాన్య ప్రతిని ధులు తెలిపారు. ఒడిశా వెళితే తమకు ఎంత వేతనం ఇస్తారు, ఎటువంటి భద్రత కల్పిస్తారనే అనుమానాలు కార్మికులు వ్యక్తం చేశారు. వీటి అన్నింటికి అవసరమైన సమాధానం సోమవారం తెలియచేస్తామని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోలేదు

- ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలన్నదే మా ఉద్దేశం
- కూటమి అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, మే 19: 'మేము ఎవరినీ లక్ష్యంగా చేసుకోలేదు. ఆ అవసరం మాకు లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగాలన్నదే మా ఉద్దేశం.' అని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కలిశెట్టి అప్పలనాయుడు, అదితి గజపతిరాజు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఎంపీ ఓట్లను వేరు చేసే ప్రక్రియకు ఒక పార్టీ వారినే పిలిచి, మిగతా పార్టీలని ఎందుకు పిలవలేదనే తాము ప్రశ్నించామన్నారు. 'అందరినీ ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఉంటే, మేము ఎందుకు అధికారుల తీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తాం. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నడిపించాల్సిన బాధ్యత అధికారులదే. అటువంటి అధికారులు ఒక పార్టీని ఒకలా.. మరో పార్టీని మరోలా చూడడం ఏమిటి. అన్ని పార్టీలను సమానంగా చూడాలి. కచ్చితమైన సమాచారం ఇవ్వాలి. పోస్టల్ బ్యాలెట్‌ను వేరు చేసే విషయంలో ఈ విధంగా చేసుంటే మేం అడిగేవారం కాదు. అధికారులు టీడీపీకి సమాచారం ఇచ్చామని చెబుతున్నారు. ఆ సమాచారం ప్రకారం 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌కి రమ్మని ఉంది. అన్ని పార్టీలకు ఆ సమాచారం ఇవ్వకుండా, వైసీపీ వారిని మాత్రం తహసీల్దారు కార్యాలయానికి ఎందుకు ఆహ్వానించారో? చెప్పాలి. అధికారుల తీరును లేఖ ద్వారా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాం.' అని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు, పిళ్లా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



రాజాంలో ఆదివారం ఉషోదయ వేళ ఆకాశం ఆహ్లాదకరంగా కనిపించింది. ఉదయం 5 గంటల సమయంలో ఓవైపు లేలేత సూర్యకిరణాలు.. మరోవైపు బంగారు వర్ణంతో ఆకాశం వెలిగిపోయింది. సాయంత్రం సూర్యుడు అస్తమిస్తూ మబ్బుల చాటున వెళ్లే కొద్ది చీకటిగా మారింది. శ్రీకాకుళం రోడ్‌లో పలువురు ఈ చిత్రాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

-రాజాం రూరల్



దిక్సూచి DIKSUCHI



ఇండియా శ్రామిక మార్కెట్

భారతదేశం 1980 తరవాత ప్రత్యేకించి 1990 తరవాత సుస్థిరమైన అధికవృద్ధి రేటును నమోదు చేసింది. 2000 సంవత్సరం మొదటి అర్ధభాగంలో ఈ రేటు మరింత ఎక్కువగా నమోదైంది. కొన్నిసార్లు అది 8 శాతాన్ని కూడా దాటింది. అయితే 2008 తరవాత ప్రపంచ ఆర్థిక మందగమనం వల్ల అది క్రమేణా తగ్గి కొవిడ్ కాలంలో పూర్తిగా కుంగిపోయింది. ఇప్పుడు మరలా కోలుకుని అతి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉంది. దాదాపు నాలుగు దశాబ్దాలపాటు సగటున ఆరు శాతం వార్షిక వృద్ధిని భారత ఆర్థికవ్యవస్థ నమోదు చేయడం విశేషం.

ఇండియన్ ఎకానమీ

రాబోయే 15 సంవత్సరాలు భారత ఆర్థికవ్యవస్థ సగటున 5 నుంచి 6 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఇటీవల భారతప్రభుత్వ అంచనాల ప్రకారం భారత ఆర్థికవ్యవస్థ 2022లో 7.3శాతం, 2023లో 7.2 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసింది. 2027 నాటికి ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా, 2030 నాటికి ఏడు ట్రిలియన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి గల దేశంగా అవతరించగలదనే అంచనాలు ఉన్నాయి. 1990 తరవాత భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా ప్రపంచీకరణ పొందింది. 1984లో భారత స్థూల దేశీయోత్పత్తిలో వస్తుసేవల ఎగుమతుల విలువ 6.3 శాతం ఉండగా, 2022లో 22 శాతానికి చేరింది. అధిక ఆర్థికవృద్ధి రేటు నిరపేక్ష పేదరికాన్ని తగ్గించి, జీవన ప్రమాణాలను పెంచిందని చెబుతున్న మానవాభివృద్ధి సూచికలోనూ, తలసరి ఆదాయంలోనూ ఇతర దేశాలతో పోల్చితే భారతదేశం ఇంకా చాలా వెనుకబడి ఉంది. ఉదాహరణకు తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2024 ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం జి.20 దేశాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల దేశంగా భారత్ ఉంది. ఉదాహరణకు భారత ప్రజల తలసరి ఆదాయం కొనుగోలు శక్తి ఆధారిత స్థూల జాతీయాదాయం ప్రకారం 8,210 డాలర్లు కాగా అమెరికా ప్రజల తలసరి ఆదాయం 77,530 డాలర్లు. చైనా తలసరి ఆదాయం 21,250 డాలర్లు. ఇక అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ప్రజల తలసరి ఆదాయం 2601 డాలర్లు, కొనుగోలు శక్తి ఆధారిత విలువ ప్రకారం 9,073 డాలర్లు. ఈవిధంగా ఆర్థికవ్యవస్థ వృద్ధి ఎక్కువగా ఉన్నా, ప్రపంచ అతిపెద్ద ఆర్థికవ్యవస్థల్లో ముందు స్థానానికి ఎగబాకుతున్నా మానవాభివృద్ధిలో, తలసరి ఆదాయంలో ఇతర దేశాల కంటే తక్కువగా ఉండటానికి పెరుగుతున్న వృద్ధి ఆర్థికవ్యవస్థ నిర్మాణ స్వరూపాన్ని విప్లవాత్మకంగా మార్చకపోవడమే కాకుండా, సేవలరంగ మూలధన ఆధారిత వృద్ధిగా ఉండి ఉపాధి అవకాశాలను తగినంతగా సృష్టించడంలో విఫలమవడమే కారణం.

ఉపాధి నిర్మాణ స్వరూపాన్ని మార్చలేని అధిక ఆర్థికవృద్ధిరేటు

పైన తెలిపిన అధిక ఆర్థికవృద్ధి రేటు ఉపాధి నిర్మాణంలో విప్లవాత్మక మార్పులు తేవడంలో విఫలమైంది. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి శాతం చాలా తక్కువ రేటుతో స్థిరంగా తగ్గగా, సేవలరంగంపై ఆధారపడిన వారి శాతం తక్కువ రేటుతో స్థిరంగా పెరిగింది. పారిశ్రామిక రంగంపై ఆధారపడిన వారి శాతం దాదాపు స్థిరంగా ఉంది. 2000లో వ్యవసాయరంగం మీద ఆధారపడిన వారు 60 శాతం ఉండగా, 2019లో 42 శాతం ఉన్నారు. అదేకాలంలో సేవలరంగంపై ఆధారపడినవారు 23 శాతం నుంచి 32 శాతానికి పెరగ్గా, వస్తు తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్)లో 12 నుంచి 14 శాతం మాత్రమే ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ఇదేకాలంలో క్రమబద్ధమైన(రెగ్యులర్) ఉపాధి పొందుతున్న వారి శాతం 2000 సంవత్సరంలో 14 శాతం ఉండగా 2019 నాటికి 21 శాతంగా, సంఘటితరంగంలో పనిచేస్తున్న వారి శాతం 2000లో 12 శాతం ఉండగా, 2019లో 18 శాతంగా ఉంది. అయితే మొత్తం కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు(సంఘటిత - అసంఘటిత రంగంలో గల అసంఘటిత కార్మికులు)గా ఉండటం గమనార్హం. అంతేకాకుండా మొత్తం ఆదాయంలో కార్మికుల ఆదాయ శాతం 2019లో కూడా 2000 సంవత్సరం కంటే ముందరి స్థాయిలోనే ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక పేర్కొంది.

తక్కువస్థాయి-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలతో ఇండియా శ్రామిక మార్కెట్



ఇండియా ఆర్థిక వృద్ధిరేటు ఎక్కువగా ఉన్నా, ఇండియా అతిపెద్ద ఆర్థికవ్యవస్థ సరసన చేరుతున్నా ఇండియా శ్రామిక మార్కెట్ మాత్రం తక్కువ-మధ్యస్థాయి ఆదాయం గల దేశాల లక్షణాలను కలిగి ఉన్నదని ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక తెలిపింది. కింది లక్షణాలను ఉదాహరణగా పేర్కొన్నది.

1. అభివృద్ధి చెందిన దేశాలు ఆరంభంలో పారిశ్రామికరంగం వృద్ధిలో ప్రధానంగా అభివృద్ధి చెందగా, ఇండియా మాత్రం సేవలరంగం సహాయంతో అధిక వృద్ధిరేటును నమోదు చేస్తున్నది. వ్యవసాయరంగంపై ఆధారపడిన జనాభా క్రమంగా తగ్గి అది పారిశ్రామికరంగంలో కాకుండా సేవలరంగంలో ఉపాధి పొందుతున్నది. అయితే స్థూల దేశీయోత్పత్తిలో సేవల రంగం వాటా 55 శాతం ఉండగా, ఉపాధిలో మాత్రం దీని వాటా 23 శాతంగానే ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా కేవలం 14 శాతం ఉండగా, వస్తువుల తయారీ రంగం(మాన్యుఫ్యాక్చరింగ్) వాటా 18 శాతంగానే ఉంది.
2. రెండు - మూడు శాతం ఉన్న బహిరంగ నిరుద్యోగం 2019 నాటికి 5.8 శాతానికి చేరడం.
3. కార్మికుల్లో 90 శాతం అసంఘటిత కార్మికులు ఉండటం. సంఘటితరంగంలో కూడా పెద్ద మొత్తంలో అసంఘటిత కార్మికుల నిష్పత్తి ఉండటం. మొత్తం కార్మికుల్లో 50 శాతం స్వయంఉపాధి పొందుతున్నవారు ఉండటం.
4. లింగపరంగా, ప్రాంతాల వారీగా, వృత్తుల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, స్థానికత ఆధారంగా ఉపాధి అవకాశాల్లో, వేతనాల్లో పరిమితులు ఉండటం.
5. 2022లో మహిళా శ్రామికుల భాగస్వామ్యం రేటు కేవలం 25 శాతంగా ఉండటం. ప్రపంచంలోనే అతి తక్కువ మహిళా శ్రామిక భాగస్వామ్యం ఉన్న ప్రపంచ దేశాల సరసన భారతదేశం ఉంది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, హైదరాబాద్.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

కోడింగ్ - డీకోడింగ్

పార్ట్-4

రీజనింగ్



ఇప్పటివరకు ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో ఒక పదంలోని అక్షరాలు, మరొక అక్షరాలుగా మారే విధానంలో అనేక పద్ధతులను, నెంబర్ కోడింగ్‌కు సంబంధించిన వివిధ పద్ధతులను గత సంచికల్లో తెలుసుకున్నాం. ఈ కోడింగ్-డీకోడింగ్ చాప్టర్‌లో మిగిలిన వివిధ రకాల మోడల్స్‌ను పరిశీలిద్దాం.

డిజిట్ కోడ్

డిజిట్ కోడ్: దీనిలో ఒక పట్టిక, దాని కింద కొన్ని నియమాలు ఇస్తారు. పట్టికలో అంకెలు, వాటి కింద ఆంగ్ల అక్షరాలు ఉంటాయి. ఇచ్చిన నియమాలను జాగ్రత్తగా అవగాహన చేసుకొని తదనుగుణంగా ఈ కోడింగ్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవలసి ఉంటుంది.

డిజిట్	2	5	7	8	9	4	6	3	1
లెటర్ కోడ్	M	R	T	B	W	K	D	N	J

నియమాలు:

1. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో I అనే అక్షరం రాయాలి.
2. ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు అయితే ఆ రెండు స్థానాలలో Y అనే అక్షరం రాయాలి. పై నియమాలు, పట్టిక ఆధారంగా కింది సంఖ్యలకు సరైన కోడ్ అక్షరాలు తెలపండి.

1. 726395కు కోడ్‌ను తెలపండి?
ఎ) IMDNWI బి) YDMNWY
సి) TMDNWR డి) IMDNWR
2. 263847కు కోడ్ తెలపండి?
ఎ) IDNBKI బి) YDNBKY
సి) IDNBKY డి) MDNBKT
3. 591248కు కోడ్‌ను తెలపండి?
ఎ) IWJMKB బి) RWJMKY
సి) YWJMKY డి) RWJMKB
4. 615824కు కోడ్‌ను తెలపండి?
ఎ) IJRBMI బి) IJRBMY
సి) YJRBMY డి) DJRBMK
5. 831796కు కోడ్‌ను తెలపండి?
ఎ) INJTWR బి) BNJTWR
సి) YNJTWY డి) YNJYWY

సమాధానాలు వివరణలతో:

1. **సమాధానం:** (ఎ)
వివరణ: ప్రశ్నగా ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు బేసి అంకెలు. కాబట్టి మొదటి నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో I రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
7 2 6 3 9 5
I M D N W I కాబట్టి సమాధానం (ఎ) అవుతుంది.
2. **సమాధానం:** (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె సరి అంకె. చివరి అంకె బేసి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
2 6 3 8 4 7
M D N B K T కాబట్టి సమాధానం (డి) అవుతుంది.
3. **సమాధానం:** (డి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి అంకె బేసి అంకె, చివరి అంకె సరి అంకె అయినందున ఏ నియమం అనుసరించదు. ఆయా అంకెలకు పట్టికలోని అక్షరాలనే కోడ్‌గా భావించాలి.
5 9 1 2 4 8
R W J M K B కాబట్టి సమాధానం (డి) అవుతుంది.
4. **సమాధానం:** (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
6 1 5 8 2 4
Y J R B M Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.
5. **సమాధానం:** (సి)
వివరణ: ఇచ్చిన సంఖ్యలో మొదటి, చివరి అంకెలు సరి అంకెలు. కాబట్టి రెండో నియమాన్ని అనుసరించి ఆ రెండు స్థానాలలో Y రాయాలి. మిగిలిన అంకెలకు పట్టికలో ఆ అంకె కింద అక్షరమే కోడ్ అవుతుంది.
8 3 1 7 9 6
Y N J T W Y కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

ప్రతిక్షేపణ పద్ధతి

ఈ విధానానికి సంబంధించిన ప్రశ్నలలో కొన్ని వస్తువులను మరొక రకమైన వస్తువులుగాను, కొన్ని రంగులను మరొక రంగులుగాను, కొన్ని వాహనాలను మరొక వాహనాలుగాను, పరిగణించే విధంగా కోడ్ ఇస్తారు. తదుపరి ఒక ప్రశ్న ఇస్తారు. ఆ ప్రశ్నకు ముందుగా సరైన సమాధానాన్ని (ఒరిజినల్ ఆన్సర్) అనుకొని దానికి ఏది కోడ్ చేశారో ఆ కోడ్‌ని సమాధానంగా చెప్పాల్సి ఉంటుంది.

1. **ఒక కోడ్ భాషలో CARను TRACTOR గాను, TRACTORను BUS గాను, BUSను AUTO గాను, AUTOను VAN గాను పిలుస్తారు. అయితే పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ఏమిటి?**
ఎ) BUS బి) CAR సి) TRACTOR డి) VAN
సమాధానం: (ఎ)
వివరణ: సాధారణంగా పొలం దున్నటానికి ఉపయోగించే వాహనం ట్రాక్టర్ (ఇది ఒరిజినల్ ఆన్సర్). కాని ఇక్కడ TRACTORను BUSగా పిలవడం జరిగింది. అనగా దీని అర్థం TRACTORను BUSగా కోడ్ చేయడం జరిగింది. కాబట్టి సమాధానం BUS అవుతుంది.
2. ఒక కోడ్ భాషలో rainను roadగాను, roadను riverగాను, riverను seaగాను, seaను skyగాను, skyను cloudగాను పిలుస్తారు. అయితే విమానాలు ఎక్కడ ఎగురుతాయి?
ఎ) sea బి) cloud సి) road డి) river
సమాధానం: (బి)
వివరణ: విమానాలు ఎల్లప్పుడూ ఆకాశంలోనే ఎగురుతాయి. అంటే ఒరిజినల్ ఆన్సర్ ఆకాశం ఇచ్చిన ప్రశ్నలో ఆకాశాన్ని Cloudగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం Cloud అవుతుంది.
3. ఒక కోడ్ భాషలో ఎరుపును ఆకుపచ్చగాను, ఆకుపచ్చను నలుపుగాను, నలుపును పసుపుగాను, పసుపును తెలుపుగాను, తెలుపును ఎరుపుగాను పిలుస్తారు? అయితే పాల రంగు ఏమిటి?
ఎ) నలుపు బి) పసుపు సి) ఎరుపు డి) ఆకుపచ్చ
సమాధానం: (సి)
వివరణ: సాధారణంగా పాల రంగు తెలుపు. (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో తెలుపు రంగును ఎరుపుగా పిలుస్తారని ఉన్నది. కాబట్టి సమాధానం ఎరుపు అవుతుంది.
4. ఒక కోడ్ భాషలో earను eyeగాను, eyeను handగాను, handను mouthగాను, mouthను tongueగాను, tongueను elbowగాను పిలుస్తారు? అయితే మనం ఏదైనా విషయానికి సంబంధించి వినడానికై ఉపయోగించే జ్ఞానేంద్రియం ఏది?
ఎ) eye బి) tongue సి) hand డి) mouth
సమాధానం: (ఎ)
వివరణ: మానవులు వినడానికి ఉపయోగించే జ్ఞానేంద్రియం చెవి (ఒరిజినల్ ఆన్సర్) ఇచ్చిన ప్రశ్నలో చెవిను కన్నుగా పేర్కొన్నారు. కాబట్టి సమాధానం eye అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

నక్సలైట్ టెస్ట్ పేరుతో ఆటవికం

మహిళలను తాకరాని చోట తాకుతూ బలగాల అరాచకం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రఘు మిడియామి

- ఆధార్ లేకుంటే ఆదివాసీ మహిళలకు హింసే
- మహిళలు స్నానాలు చేస్తుంటే.. డ్రోన్లతో వీడియోల చిత్రీకరణ
- రాకెట్ లాంచర్లు, డ్రోన్లతో దాడులు
- అత్యాచారాలు.. కాల్పులతో భయంభయం
- 'ఆంధ్రజ్యోతి'తో.. ఎంబీఎం, బీజేసీఎస్ నేత రఘు మిడియామి

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): "ఛత్తీస్‌గఢ్ అడవుల్లో పోలీసు బలగాలు ఆటవిక ప్రవర్తనతో పేట్రేగిపోతున్నాయి. నక్సలైట్ల పేరుతో మూలవాసీ, ఆదివాసీ మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆధార్ కార్డు లేకపోతే.. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలను నక్సలైట్ టెస్ట్ పేరుతో పాశవికంగా హింసిస్తున్నాయి. నక్సలైట్ టెస్ట్ అంటే.. మహిళలను తాకరాని చోట తాకడం.. ఈ పరీక్షలో మహిళ వక్షోజాల నుంచి పాలు వస్తే నక్సలైట్ కాదని, రాకుంటే నక్సలైట్ అని బలగాలు భాష్యం చెబుతున్నాయి. అడవుల్లో రెండేసి కిలోమీటర్లకు ఒకటి చొప్పున క్యాంపులను ఏర్పాటు చేసుకున్న కేంద్ర బలగాలు అరాచకాలు అన్నీఇన్నీ కావు" అని మూలవాసీ బచావో మంచ్(ఎంబీఎం), బస్తర్ జనసంఘర్ష్ సమన్వయ సమితి(బీజేసీఎస్) అధ్యక్షుడు రఘు మిడియామి వాపోయారు. ఎక్కడో మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న హింసపై యావత్ దేశం ఎలుగెత్తిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న దారుణాలకు సంఘీభావం తెలిపేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దండకారణ్యంలో మారణహోమం, కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలంటూ ఈ నెల 18న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాలు నిర్వహించిన కార్యక్రమంలో రఘు మిడియామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వాలు మారినా..

ప్రభుత్వాలు మారినా.. మా తలరాతలు మారడం లేదు. మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్లన్నీ మూలవాసీలు, ఆదివాసీలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. అడవి బిడ్డలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులు మాకు వర్తించకుండా చేస్తున్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛను హరించినప్పుడే విప్లవం పురుడుపోసుకుంటుంది. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలు, మూలవాసీల్లో అది మొదలైంది. మా అడవుల్లో మేం బతకాలంటే.. 'రణమా..? మరణమా..??' అన్నట్లుగా పరిస్థితులు మారిపోయాయి. దీంతో మేం ఎంబీఎం, బీజేసీఎస్‌లను స్థాపించాం. పోరాడుతున్నాం. మాపైనా కేంద్ర బలగాల బెదిరింపులు పెరిగాయి. అరెస్టులు పెరిగాయి. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మా సమస్యలేమిటి? పోరాటం ఎందుకు? అనేది తెరమీదకు, జనం మధ్యకు రాకుండా కేంద్ర బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మాపైన మావోయిస్టు ముద్ర వేస్తున్నాయి. బూటకపు ఎన్‌కౌంటర్లలో అమాయకులైన ఆదివాసీలు, మూలవాసీలను హతమారుస్తూ.. అక్కడ ఎలాంటి సమస్యల్లేవంటూ బయటి ప్రపంచానికి చెబుతున్నాయి. అందుకే మా సమస్యలేంటో చెప్పుకోవడానికి హైదరాబాద్ వచ్చాం. దయచేసి మీడియా మిత్రులు మా ప్రాంతాలను సందర్శించాలి. మా ఇబ్బందులేమిటో మీకు అర్థమవుతాయి.

సిలేంగురు స్మృతిదినం జరపనివ్వలేదు

ఆదివాసీల అక్రమ అరెస్టు, బూటకపు ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ 2021 మే 10న మేం పోరాటాలను ప్రారంభించాం. ప్రశాంత జీవనాన్ని కోరుకున్నాం. అటవీ వనరుల ప్రైవేటీకరణను, మావోయిస్టుల పేరుతో సైనికీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాం. 2021 మే 10న సిలేంగురులో జరిగిన పోరాటం సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపారు. మా సంఘాలకు చెందిన ముగ్గురు సభ్యులను పొట్టనబెట్టుకున్నారు. వారి స్మృతికి గుర్తుగా ఏటా మే 9, 10 తేదీల్లో సిలేంగురు స్మృతిదినం జరుపుకొంటున్నాం. ఈ ఏడాది మాత్రం పోలీసులు అనుమతుల్లేవంటూ అడ్డుకున్నారు. అయితే.. జూన్ 9, 10 తేదీల్లో స్మృతిదినాన్ని నిర్వహించి తీరుతాం.

సహజ వనరుల కోసమే..

ప్రభుత్వాలు ఆదివాసీలు, మూలవాసీల పట్ల బలగాలతో ఇంత కర్కశంగా దాడులు చేయించడానికి కారణం.. అడవుల్లో ఉన్న సహజ వనరులు, నిక్షేపాల కోసమే. బస్తర్, సుక్మా, కాంకేర్, దంతేవాడ, నారాయణపూర్, బీజాపూర్.. ఇలా పలు ప్రాంతాల్లో 28 రకాల నిక్షేపాలున్నాయి. మైనింగ్‌తో ఆ ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనేదే ప్రభుత్వాల ఆలోచన. ఆ ప్రయత్నాలకు మేం అడ్డుగా ఉన్నాం. మావోయిస్టులు కూడా ఎప్పటికప్పుడు ఆ ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. అందుకే మమ్మల్ని అడవులను ఖాళీ చేసి వెళ్లేలా చేస్తున్నారు. మా అడవుల్లో 'మురియా' వంటి అంతరించిపోతున్న గిరిజన తెగలు(పీవీటీజీ) ఉన్నాయి. గిరిజనులు.. ప్రత్యేకించి పీవీటీజీల పరిరక్షణకు రాజ్యాంగం, చట్టాలు ఉన్నాయి. అయినా.. ప్రభుత్వాలు ఇలా మాపై కక్షకట్టడం బాధాకరం. మా సంపదను కొల్లగొట్టేందుకు ఇప్పటికే కొన్ని కంపెనీలు అడవుల్లో తిష్టవేశాయి. అయితే.. చదువుకున్న ఆదివాసీలకు ఉపాధి కల్పించడంలో ఆ కంపెనీలు ఆసక్తి చూపడం లేదు. గడిచిన పాతికేళ్లలో 10 వేల మంది ఆదివాసీలు, మూలవాసీలను అరెస్టు చేశారు. పలువురిని బూటకపు ఎన్‌కౌంటర్లు చేసి, కాల్చిచంపారు.

మహిళల నగ్న వీడియోల కోసమా?

ఆధార్ లేకుంటే.. మా అడవుల్లో తిరగడానికి మేం అర్హులం కాదని బలగాలు హుకుం జారీ చేశాయి. ఆధార్ లేకుంటే.. మావోయిస్టుల ముద్ర వేసి, ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. తునికాకు సేకరణకు వెళ్లే మహిళలకు నక్సలైట్ టెస్ట్‌లు పెడుతున్నారు. మహిళలు స్నానం చేస్తుంటే.. డ్రోన్ కెమెరాలతో నగ్న దృశ్యాలను చిత్రీకరిస్తున్నారు. ఆ వీడియోలను చూపుతూ.. మా వాళ్ల ఇంటి నుంచి బయటకు రాకుండా చేస్తున్నారు. అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లు, కాల్పులు, రాకెట్ దాడులతో ప్రశాంత అడవులు మోతెత్తిపోతున్నాయి. అడవులే మా నివాసాలు. మావోయిస్టుల పేరుతో మమ్మల్ని అడవుల్లోంచి వెళ్లగొడుతున్నారు. ఈ మధ్య జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు చనిపోయారని పోలీసులు ప్రకటించుకున్నారు. నిజానికి ఆ చనిపోయిన వారిలో ఇద్దరు మాత్రమే నిరాయుధులైన నక్సలైట్లు. మిగతావారంతా తునికాకు సేకరణకు వెళ్లినవారే.

క్యాంపులతో అరాచకాలు

గతంలో రహదారులు, సరిహద్దుల వెంబడి సీఆర్పీఎఫ్ క్యాంపులు ఉండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొచ్చుకువచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కోసం నిర్మించిన భవనాల్లో తిష్టవేస్తున్నారు. రోడ్లపైనా ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక క్యాంపును పెట్టారు. క్యాంపుల్లోని బలగాలు ఆదివాసీలపై చేస్తున్న అరాచకాలు అన్నీఇన్నీ కావు. గ్రామాల్లోకి వచ్చి, బలవంతంగా డబ్బులు లాక్కెళ్తున్నారు. ఫూటుగా తాగి.. కాల్పులు జరుపుతున్నారు. ఇలా జరిపిన కాల్పుల్లో ఇటీవల ఆరు నెలల వయసున్న ఓ చిన్నారి మరణించింది. ఏళ్ల తరబడి ఏర్పాటు చేస్తున్న బేస్‌క్యాంపుల కోసం మొత్తం 2 లక్షలకు పైగా చెట్లను నరికేశారు.

దక్షిణ అండమాన్‌కు 'నైరుతి'



విజయవాడ పటమట ప్రాంతంలో మబ్బులు కమ్మేసిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

పడమర, నైరుతి గాలులు బలంగా వీయడం, భారీగా తేమ మేఘాలు ఆవరించడం, శనివారం నుంచి నికోబార్ దీవుల్లో వర్షాలు కురవడం వంటి అంశాలను పరిగణనలో తీసుకుని నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయని ఐఎండీ నిర్ధారించింది. కాగా, ఈనెల 22వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత అది ఈశాన్యంగా పయనించి 24వ తేదీ కల్లా మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ తెలిపింది. 24వ తేదీ తర్వాత అది మరింత బలపడి తుఫాన్‌గా మారి ఒడిశా తీరం దిశగా వచ్చే అవకాశం ఉందని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత దీనిపై మరింత స్పష్టత వస్తుందన్నారు. కాగా, తమిళనాడు పరిసరాల్లో ఆవర్తనం, మహారాష్ట్ర నుంచి తమిళనాడు వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈనెల 23వ తేదీ వరకు దక్షిణ భారతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. కర్ణాటక కోస్తా ప్రాంతంలో ఈనెల 20, 21 22 తేదీలు, దక్షిణ కర్ణాటకలో 21, 22 తేదీలు, లక్షద్వీప్‌లో 20, 21 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 20, 21, 22 తేదీల్లో తమిళనాడు, పుదుచ్చేరి, కరైకాల్, కేరళ, మాహే ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, లక్షద్వీప్, దక్షిణకర్ణాటక, ఏపీ, తెలంగాణ, యానాం, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో వచ్చే ఏడురోజులు ఉరుములు, మెరుపులు, పిడుగులు, బలమైన గాలులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.

రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షం.. పిడుగులు.. నేడూ కొనసాగే అవకాశం

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఈదురు గాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. దాదాపు 47 ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. పెదకూరపాడులో 55.5, వత్సవాయిలో 40, జగ్గయ్యపేటలో 39.5, అడ్డతీగలలో 38, చింతలపల్లిలో 36, అనపర్తిలో 35.2, రావికమతంలో 35.7, రాజవొమ్మంగిలో 35, బిక్కవోలులో 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం మన్యం, అల్లూరి, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, అనంతపురం, సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరు జిల్లాల్లోని 24 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

నకిలీ ఇంటర్వ్యూలు, నియామక పత్రాలు

- రైల్వే, ప్రభుత్వ ఉద్యోగాల పేరిట భారీ మోసం
- లక్షలు వసూలు చేసి ఉడాయిస్తున్న మోసగాళ్లు
- రైల్ నిలయం వేదికగా కార్యకలాపాలు
- సహకరిస్తున్న కొందరు సిబ్బంది, అధికారులు

హైదరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసే ముఠాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మోసగాళ్ల వలలో చిక్కుకుని పలువురు నిరుద్యోగులు లక్షలాది రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా పరిపాలన కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైల్ నిలయంలో పని చేస్తున్న కొంత మంది కిందిస్థాయి సిబ్బంది, అధికారులు ఈ మోసగాళ్లతో కుమ్మక్కైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీరి మోసాలను అడ్డుకునే యంత్రాంగం లేకపోవడంతో అమాయకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాట్సాప్ గ్రూపులు, వెబ్‌సైట్ల నుంచి నిరుద్యోగుల ఫోన్‌నెంబర్లు సేకరించి మోసగాళ్లు వల విసరుతున్నారు. రైల్వేతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పలు విభాగాల్లో ఖాళీలను, బ్యాక్‌లాగ్‌లను భర్తీ చేస్తున్నారని మభ్యపెడుతున్నారు. ఆయా సంస్థల పేరిట నకిలీ లేఖలు సృష్టించి ఇంటర్వ్యూలు నిర్వహించి, హాజరైనవారికి నకిలీ నియామక పత్రాలు కూడా అందించటం విశేషం. రూ.10-15 లక్షల వరకు వసూలు చేసుకొని ఉడాయిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు సంబంధించిన నిరుద్యోగులను కూడా వీరు మోసగించినట్లు తెలుస్తోంది. రైల్వేలో టీటీఈ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికిన ముఠా సభ్యులు హైదరాబాద్ కందికల్ భట్‌జీనగర్ ప్రాంతంలోని ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.12 లక్షలకు బేరం కుదుర్చుకున్నారు. అయితే, రైల్వేలో టీటీఈ ఉద్యోగ నియామకాలు జరగడం లేదని ఆ అభ్యర్థి తెలుసుకొని వారిని నిలదీయటంతో, వాళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా.. రైల్వేలో లేదు కానీ, కావాలంటే తమిళనాడు రాష్ట్ర ఏజీ (అకౌంటెంట్ జనరల్) కార్యాలయంలో ఎల్‌డీసీ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. ఈ మేరకు ముఠా సభ్యుడు అనిల్‌కుమార్ ఓ ఫేక్ లెటర్‌తో చెన్నైలో సదరు నిరుద్యోగికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేశాడు. నాలుగు రోజుల పాటు అక్కడే ఉంచి 'నియామకపత్రాన్ని' కూడా అందించాడు. ఒప్పందం మేరకు డబ్బులు తీసుకున్నాడు. రెండు వారాలవ్యవధిలో ఉద్యోగంలో చేరడానికి మళ్లీ సమాచారం ఇస్తామని చెప్పి పంపించారు. కానీ, నెల గడిచినా సమాచారం లేకపోవడంతో బాధితుడు.. తమిళనాడు ఏజీ కార్యాలయానికి వెళ్లి చూపగా అది నకిలీదని తేలింది. అనిల్‌కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయినట్టు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఈ ఒక్క వ్యక్తికే పరిమితం కాలేదని, ఆదాయపన్ను శాఖలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్స్, రైల్వేలో క్లర్క్, టీటీఈ తదితర ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి ఈ ముఠా భారీ మొత్తంలో వసూలు చేసినట్టు సమాచారం.

23న అన్నమయ్య జయంతి

విజయనగరం రూరల్, మే 19: శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ, ఘంటసాల స్మారక కళాపీఠం సంయుక్తంగా అన్నమయ్య జయంతిని పురస్కరించుకుని ఈనెల 23న గురజాడ కళాభారతిలో అన్నమయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గ్రంధి విష్ణుమూర్తి, దవళ సర్వేశ్వరరావు, ఎం భీష్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఆరు గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సంగీత కళాకారులచే అన్నమయ్య కీర్తనలు ఆలపించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్ ట్రస్టు చైర్మన్ నారాయణం శ్రీనివాస్ హాజరౌతారని తెలిపారు. భక్తులు, సంగీత కళాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా కొత్తమ్మ తల్లి ఘటాల ఊరేగింపు

విజయనగరం రూరల్, మే 19: నగరంలోని ఫూల్‌బాగ్, అయ్యప్ప స్వామి ఆలయం వెనుక వున్న కొత్తమ్మ తల్లి పండుగ సందర్భంగా ఘటాల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది.. మేళతాళాలు, నేల వేషాలతో ఈ ఊరేగింపు కార్యక్రమం అద్దెపల్లివారు వీధిలో ప్రారంభమై, కొత్తపేట, నీళ్ల ట్యాంకు గోకుల పార్కు, ప్రేమసమాజం మీదుగా ఆలయానికి చేరుకుంది.. అక్కడ వైభవంగా కొత్తమ్మతల్లికి ఘటోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వెళ్లి కొత్తమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

లక్కవరపుకోట, మే 19: గ్రంథాలయాలను అందరూ ఉపయోగించుకుని విజ్ఞానం పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి మేరీనిర్మల పేర్కొన్నారు. ఆదివారం గ్రంథాలయం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు వేసవిలో గ్రంథాలయాన్ని వినియోగించుకుని పుస్తకాలు, పేపర్లు చదువుకోవాలన్నారు. ఇక్కడ విద్యార్థులకు తగ్గట్టుగా అన్ని రకాల ఆటలు, కథల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. అన్ని కాంపిటేటివ్ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు 22 వరకు గడువు

లక్కవరపుకోట, మే 19: మండల కేంద్రంలో గల ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22 ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ ప్రకాష్ తెలిపారు. పదో తరగతి అర్హత పొందిన వారు ఇంటర్ ఇంగ్లిషు మీడియం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎల్.కోటలో భారీ వర్షం

లక్కవరపుకోట, మే 19: మండల కేంద్రమైన ఎల్.కోటలో ఆదివారం సాయంత్రం ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ సాయంత్రం వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఉరుములు, పిడుగులతో గాలి వీయడంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అక్కడక్కడా మోస్తరు జల్లులు కురవడంతో ప్రజలు వేసవి తాపం నుంచి ఉపసమనం పొందారు.

కఠిన చర్యలు తప్పవు

లక్కవరపుకోట, మే 19: ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆర్.గోపాలరావు ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికలు పూర్తయినా జూన్ 4 వరకు కోడ్ అమలులో ఉందని చెప్పారు. పార్టీల పరంగా ఏ విధమైన కవ్వింపు చర్యలకు పాల్పడరాదన్నారు. సీఐ ఉపేంద్రతో కలిసి అన్ని సమస్యాత్మక గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

రాజాం రూరల్, (బొబ్బిలి): ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పీఆర్టీయూ బొబ్బిలి శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గజపతినగరం మండలం శ్రీరంగరాజపురంలో పీవోగా విధుల్లో ఉన్న ఉపాధ్యాయుడు వాసిరెడ్డి రాంబాబును అకారణంగా కొట్టడాన్ని ఆశాఖ ప్రతినిధులు తప్పుపట్టారు. రాంబాబును ఆదివారం కలిసి సంఘీభావం ప్రకటించారు. రాంబాబును కలిసిన వారిలో వాలేటి తవిటినాయుడు, సత్య నారాయణ, విజయ్ కుమార్, అప్పలనాయుడు, శంకర్రావు, తిరుపతి తదితరులున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతుల్లేవ్

రాజాం రూరల్, (బొబ్బిలి) మే 19: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ డీజే కార్యక్రమాలకు అనుమతుల్లేవని బొబ్బిలి పోలీసులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బొబ్బిలి పట్టణంలో దాడితల్లి అమ్మవారి ఉత్సవాలతో పాటు పాత బొబ్బిలి సరే పోలమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆయా ఉత్సవాల కమిటీల సభ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికలు అనంతరం రాష్ట్రంలో నెలకొన్న అల్లర్ల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కార్యక్రమాలను నిర్వహించవద్దని పోలీసులు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని పోలీసులు ఆ ప్రకటనలో కోరారు.

అధ్వానంగా సంకిలి నాగావళి వంతెన

- నిర్వహణను పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- వర్షపునీరు నిల్వతో అవస్థలు, పాడైన మార్గం



నిర్వహణ లేకపోవడంతో వంతెనపై నిల్వ ఉన్న వర్షపునీరు, రెయిలింగ్ పాడైన దృశ్యం

రేగిడి: మండలంలో సంకిలి నాగావళి నదిపై నిర్మించిన వంతెన అధ్వానంగా తయారైంది. ఈ వంతెన నిర్వహణపై అర్అండ్‌బీ శాఖ ఎడతెగని నిర్లక్ష్యం కనబరుస్తోంది. గత నాలుగు దశాబ్దాల క్రితం కోట్లాది రూపాయలతో ఈ వంతెన నిర్మించారు. ఇటు పాలకొండ- విశాఖతో పాటు ఒడిశా వెళ్లేందుకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు కీలకంగా మారింది. అటువంటి వంతెన ఇటీవల కాలంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురివుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. వంతెనకు రక్షణగా ఉన్న అటు ఇటు రైలింగ్‌లు పాడవటమే కాకుండా, వంతెనపై రోడ్డు మార్గం పెద్దగుంతలు, గోతులతో దర్శనమిస్తోంది. మరోవైపు వంతెనపై ఉన్న రంధ్రాలు మట్టితో పూడుకుపోవటం, వంతెనపై చెత్తచెదారం పేరుకుపోవటం వల్ల వర్షంనీరు బైటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వంతెనపై తాత్కాలికంగా తారుపూసి మరమ్మతులు చేసినా ప్రయోజనం లేకుండా ఉంది. వేసిన కొద్దిరోజులకే తారు తొలగిపోతున్న పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల వంతెనపై ఉన్న ఊచలు బైటకు కనిపిస్తూ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై పాలకొండ అర్అండ్‌బీ ఏఈ జగన్మోహన రావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా, మరమ్మతులకు నిధులు రాలేదని, ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేశామన్నారు. నిర్వహణపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తామని తెలిపారు.

పోస్టల్ ఓటింగ్ రీ పోల్ జరపాలి



మాట్లాడుతున్న వెంకట రమణ

విజయనగరం దాసన్నపేట, మే 19: సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి పోస్టల్ ఓటింగ్‌కు రీ పోలింగు నిర్వహించాలని స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థి పాండ్రంకి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోస్టల్ బ్యాలెటింగ్ మండల తహసీల్దారు కార్యాలయంలో స్ట్రాంగ్ రూంలో జరిగిన ఘటనపై అనుమానాలు ఉన్నా యన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు పరోక్షంగా అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం శ్రమిస్తూ మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్‌ని ఉల్లంఘిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల సమక్షంలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం తెరవడమే కాకుండా, ఖాళీ పత్రాలు వేరు చేయడం, పోస్టల్ బ్యాలెట్ మిగిలిన వారికి సీల్ వేయకపోవడం వంటి చర్యలు అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే విచారణ చేసి, పోస్టల్ బ్యాలెట్ రీపోలింగుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రేపు పాత బొబ్బిలి సరేపోలమ్మ రథోత్సవం

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 19: పాత బొబ్బిలి గ్రామదేవత సరే పోలమ్మ రథోత్సవం ఈ నెల 21న జరగనున్నది. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దేశమ్మకు వారోత్సవాలను నిర్వహించారు. బిందెల డాన్స్, ప్రభలతో పాతబొబ్బిలిలో దేశమ్మ తిరువీధి ఆలయ ధర్మకర్త చోడిగంజి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. దేశమ్మకు భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. సరే పోలమ్మ తొలేళ్ల కార్యక్రమం ఈ నెల 20న నిర్వహించనున్నారు.



పాతబొబ్బిలిలో ప్రభలతో దేశమ్మ తిరువీధి చేస్తున్న భక్తులు

వాసవీమాత జయంతి ఉత్సవాల్లో కోళ్ల



ఆలయంలో అన్నదానంలో పాల్గొన్న లలితకుమారి

శృంగవరపుకోట, మే 19: మండల కేంద్రమైన శృంగవరపుకోట వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని మొక్కుకుని నిర్వహించిన అన్నదానంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘ పెద్దలు, టీడీపీ నాయకులున్నారు.

సూర్యదేవాలయంలో ప్రత్యేకపూజలు

శృంగవరపుకోట, మే 19 : మండల కేంద్రమైన ఎస్.కోట సూర్యదేవాలయంలో వైశాఖ ఏకాదశి సందర్భంగా సూర్యదేవునికి ప్రత్యేకపూజలుచేశారు. అదివారం ఆలయ దర్మకర్త ముక్కు జానకిబాయ్(సత్యసాయి) ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు విన్నకోట సూరిబాబు పూజలుచేశారు.భక్తులు సూర్యదేవునికి పెసలు,పండ్లు సమర్పించారు.



సూర్యదేవాలయంలో పూజలు

క్రీడలతో మానసిక ఉల్లాసం



అవార్డులు అందిస్తున్న దృశ్యం

రామభద్రపురం, మే 19: క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు అన్నారు. మండలంలోని బూసాయవలస గ్రామంలో కీర్తిశేషులు మడక శ్రీదేవి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపట్లకూడా నైపుణ్యం సాధించాలన్నారు. క్రీడల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా సరైన ప్రాధాన్యం ఉంటుందన్నారు. అనంతరం ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన ఎనుబరువు గిరిజన క్రికెట్ జట్టుకు ప్రథమ బహుమతి, పాతబొబ్బిలి జట్టుకు ద్వితీయ బహుమతి షీల్డును అందించారు. ప్రథమ బహుమతి కింద రూ.15వేలు నగదు, ద్వితీయ బహుమతి కింద రూ.10వేల నగదును అందించారు. అలాగే ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ కనబరిచిన ఆదారి ప్రవీణ్‌కుమార్ 63 పరుగులు సాధించి ప్రత్యేక బహుమతిని అందుకున్నారు. బొబ్బిలి, సాలూరు, రామభద్రపురం, బాడంగి మండలాలకు చెందిన క్రికెట్ జట్లతోపాటు ఎంతోమంది క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు. యాండ్రాపు భాను, మడక పాపారావు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



లక్ష్మీగణపతి ఆలయంలో కల్యాణ మహోత్సవం దృశ్యం

శృంగవరపుకోట, మే 19: శృంగవరపుకోటలో ఉన్న శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో ఆదివారం వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పూజల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుధారాజు దంపతులు పాల్గొని కల్యాణం చేశారు. వేద పండితులు దేవరబొట్ల వికాస్‌శర్మ, విన్నకోట శ్రీనుశర్మ పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్నాట స్వామినాయుడు, మద్ది కృష్ణ, బాబులాల్, మాజీ ఎంపీటీసీ మోపాద శ్రీనివాసరావు, వందలాదిగా భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



వేదగాయిత్రి మాత ఆలయంలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరునికి కల్యాణం

శృంగవరపుకోట, మే 19: మండల కేంద్రమైన ఎస్.కోట వేదగాయిత్రిమాత ఆలయంలో కొలువైన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి లకు వైశాఖ శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు దొంతుకూర్తి సురేష్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం చేసి అనంతరం అన్నసమారాధన చేశారు.

పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

జామి: మండలంలోని లోట్లపల్లి గ్రామంలో టీడీపీ, జనసేన నాయకులు పేదలకు నిత్యావసరాలను ఆదివారం అందించారు. టీడీపీ నాయకులు జన్నెల రమణ, మాజీ ఎంపీటీసీ నూకరాజు, శ్రీను వీరికి నిత్యవసరాలు అందించారు.

మరిశర్లకు ఎక్సలెన్స్ అవార్డ్

రాజాం రూరల్, (బొబ్బిలి): పట్టణానికి చెందిన మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు గ్లోబల్ ఎక్సలెన్స్ ఎచీవర్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నీటివనరుల పరిరక్షణకు ఆయన చేసిన కృషిని గుర్తించి ఆదిలీలా ఫౌండేషన్ మరిశర్లను అవార్డుకు ఎంపిక చేసింది. జూన్ 18న ఢిల్లీలోని ఎంపిల సమక్షంలో అవార్డు అందించనున్నారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖమాస పూజులు

రేగిడి: మండలంలో వైశాఖమాసంలో గంధం అమవాస్య పూజలు ఆదివారం పలుగ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యదేవునికి పానకం పళ్ల సమర్పించి ముత్తయిదువులకు ఫలదానం ఇచ్చి తమ భక్తిభావం చాటుకున్నారు. వర్షాలు కురవాలని, అందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు.

రోగులకు పెట్టే భోజనమిదేనా?

- ఎస్.కోట ప్రాంతీయ ఆసుపత్రిలో అరకొరగా అన్నం, కూర



ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రిలో పెట్టిన భోజనం చూపిస్తున్న రోగి

శృంగవరపుకోట, మే 19: శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పెడుతున్న భోజనమిది. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ఆసుపత్రిలో రోగులకు భోజనాలు పెడుతున్నారు. ఓ రోగి పల్లెంలో తక్కువ భోజనం పెట్టడంతో నిర్వాహకులను ప్రశ్నించింది. 'నచ్చితే పట్టుకెళ్ల.. లేదంటే వదిలేయ్' అని భోజన నిర్వాహకులు దురుసుగా సమాధానం ఇచ్చారు. అక్కడున్న సిబ్బంది కూడా భోజన నిర్వాహకులకు వంతపాడారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా భోజన నిర్వాహకులకు మద్దతుగా మాట్లాడడంతో రోగులు అసహనం వ్యక్తం చేశారు. నిత్యం అన్నం, కూరలు కూడా తక్కువ పరిమాణంలో పెడుతున్నారని వాపోయారు.

ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రంలో చోరీ

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్‌టీం



సేవా కేంద్రంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

రామభద్రపురం, మే 19: మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బీఐ సేవా కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి సేవాకేంద్రం నిర్వాహకుడు పీవీ.సత్యారావు బ్యాంకు మూసివేసి ఇంటికి వెళ్లిన తరువాత అర్ధరాత్రి సమయంలో ఈ చోరీ జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సేవా కేంద్రంలోని రూ.లక్షా 60వేలు నగదుతోపాటు ల్యాప్‌టాప్, రెండు కరెంటు ఏటీఎం కార్డులు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చోరీ గురైన ప్రదేశాన్ని గుర్తించారు. అలాగే విజయనగరంలో ఉన్న క్లూస్‌టీం సిబ్బంది కూడా బ్యాంకు పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి

లక్కవరపుకోట, మే 19: మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన కరెడ్ల చిన్నారావు (60) అనే రైతు ఆదివారం సాయంత్రం పాముకాటుకు గురై మృతిచెందాడు. ఆయన కళ్లం వద్ద ఆవులకు మేత వేస్తున్న సమయంలో కాలుపై పాము కరిచింది. వెంటనే కుటుంబసభ్యులు లక్కవరపుకోట పీహెచ్‌సీకి తరలించగా అక్కడ ప్రథమ చికిత్సచేసి ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారావు మృతి చెందాడు. ఈయన మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, సర్పంచ్ రామలక్ష్మి గ్రామపెద్దలు సంతాపం తెలియజేశారు.

బాధితునికి ఆర్థిక సాయం అందజేత

బాడంగి, మే 19: ఎస్.కోట మండలంలోని ధర్మవరం గ్రామంలో డయాలసిస్ పేషెంట్ గొర్లె నారిబాబు ఆపరేషన్ నిమిత్తం బాడంగి మండలం గజరాయనివలస గ్రామం తరఫున రూ.10వేలు, అలాగే టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు రూ.3వేలు, గొర్లె సింహాచలం రూ.2వేలు మొత్తంగా రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మరింత మంది స్పందించి నారిబాబును ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఎన్జీజీవోస్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

కొత్తవలస: కొత్తవలస పంచాయతీ, కొత్తవలస-గిడిజాలరోడ్డులో ఉన్న ఎన్జీజీవోస్ కాలనీకి చెందిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ కాలనీ వాసులు కోరారు. ఆదివారం కాలనీకి చెందిన నూతన కార్యవర్గాన్ని కాలనీ వాసులు ఎన్నుకున్నారు. కాలనీ గౌరవాధ్యక్షుడిగా కె.రామారావు, అధ్యక్షుడిగా బోని వెంకట అప్పారావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ 1982 సంవత్సరంలో ఈ ప్రాంతంలో నాన్ గెజిటెడ్ అధికారులకు పేమెంట్ ఆఫ్‌కాస్టు కింద కాలనీ ఇచ్చారని, ఈ కాలనీలో చాలా మంది ఇళ్ల నిర్మాణాలను చేసుకున్నారన్నారు. పంచాయతీకి కాలనీ వాసులు పన్నులు కూడా చెల్లిస్తున్నారని, ఇన్ని చేసినా కాలనీకి సంబంధించిన మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పదో తరగతి బాలికలకు బహుమతులు



పురస్కారాలతో విద్యార్థులు

రాజాం, మే 19: రాజాం పరిసరాల్లో పది మండలాలకు చెందిన పదోతరగతి బాలికలకు ఆదివారం పురస్కారాలను బహూకరించామని ప్రముఖ గైనికాలిజిస్ట్ యడ్ల నీరజారాణి తెలిపారు. గత నెల ప్రకటించిన పదోతరగతి ఫలితాల్లో 540 మార్కులు పైబడి సాధించిన ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలను ప్రోత్సహిస్తూ 'డాక్టర్ యడ్ల నీరజారాణి' పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆమె తెలిపారు. డోలపేట ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హాజరైన 110 మంది బాలికలకు ప్రత్యేక ప్రతిభా పరీక్షను విశ్రాంతి ప్రధానోపాధ్యాయలు సామంతుల సింహాద్రినాయుడు పర్యవేక్షణలో నిర్వహించారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన బాలికలకు ఈ పురస్కారాలను అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన సంతకవిటి మండలం సిరిపురం పాఠశాలకు చెందిన అక్కలపోతు వామినికి రూ. 25వేలు నగదు బహుమతి, ద్వితీయస్థానంలో నిలిచిన వంగర మండలం అరజాడ పాఠశాలకు చెందిన కొరటాన త్రివేణికి రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సంతకవిటి మండలం వాల్తేర్ పాఠశాలకు చెందిన సింగిపురం హారికకు రూ.10వేలు నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను డాక్టర్ సామంతుల కిరణ్‌కుమార్, వై.నిరజారాణి, ఎస్ శరత్‌కుమార్, ఎం.సౌజన్య, ప్రతిమ, సవిరగాన సురేష్‌కుమార్, అశ్విని, తేజస్విని చేతుల మీదుగా అందజేశారు. హాజరైన 110 మందికి నోట్‌బుక్స్ పెన్నులను బహూకరించారు.

పేదల పక్షపాతి సుందరయ్య



పాలకొండలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, (బొబ్బిలి) మే 19: పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య అని సిటు జిల్లా అధ్యక్షుడు పి.శంకర్రావు అన్నారు. ఇక్కడి వేణుగోపాలస్వామి ఆలయం జంక్షన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ సభ్యులు రామారావు, వెంకటి, వాసు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని రెడ్డివీధిలో సీపీఎం మహిళాశాఖ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సరగడ సరస్వతి, రమణమ్మ, దేవి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

- **పాలకొండ:** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పాలకొండ మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆర్తమూడి లక్ష్మణరావు, మల్లవరం రమేష్, ఎస్.నారాయణరావు, కాద రాము, దూసి దుర్గారావు, వై.శ్రీనివాస్, సీహెచ్.సంజీవి, పి.వేణు, విమల, జి.శారద పాల్గొన్నారు.
- **గరుగుబిల్లి:** పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు పునరంకితం కావాలని సీపీఎం నాయకులు బీవీ రమణ, కరణం రవీంద్రలు పిలుపునిచ్చారు. మండలంలోని సుంకి, నాగూరు గ్రామాల్లో ఆదివారం ఏర్పాటుచేసిన పుచ్చలపల్లి వర్ధంతి సభలో వారు మాట్లాడారు. దేశంలో నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనం సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాగూరు, సుంకి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.
- జియ్యమ్మవలసలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ సుందరయ్య భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కోరంగి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.
- **సాలూరు రూరల్:** కష్టజీవుల ఆపద్బాంధువుడు పుచ్చలపల్లి సుందరయ్య అని కార్మిక నేత ఎన్‌వై నాయుడు అన్నారు. సాలూరులో ఆదివారం సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్మికులు



గరుగుబిల్లి: సుంకిలో..



జియ్యమ్మవలసలో..



సాలూరులో..

పైపులైన్లకు లీకులు

● వృథాగా పోతున్న తాగునీరు ● మరమ్మతులు చేపట్టని అధికారులు



పురిటిపెంట రైల్వేకాలనీలో పైపులైన్ల లీక్‌తో వృథా అవుతున్న తాగునీరు

గజపతినగరం: ఇంటింటికీ తాగునీరు సరఫరా జరిగే పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. ఎక్కడికక్కడే లీకులు ఏర్పడ్డాయి. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. గత ఏడాది గజపతినగరం మండలం పురిటిపెంట పంచాయతీలో పైపులైన్లు ఏర్పాటుచేశారు. వీటిద్వారా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పురిటిపెంట రైల్వే కాలనీలో ఇంటింటికి తాగునీరు సరఫరా చేసేవారు. అయితే పైపులైన్లలో నాసిరకం మెటీరియల్ ఉపయోగించడంతో ఏడాది కాకముందే మరమ్మతులకు నోచుకున్నాయి. దీంతో లీకులు ఏర్పడి, తాగునీరు వృథాగా పోతోంది. అలాగే పైపులైన్లు లీక్ కారణంగా కలుషిత నీరు వచ్చేస్తుందని, ఆ నీటిని తాగి రోగాల బారిన పడాల్సి వస్తుందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంగళాపురం జంక్షన్‌లో చెక్‌పోస్టు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

పాలకొండ: ఒడిశాలో ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మంగళాపురం జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. ఒడిశా ఎన్నికల నేపథ్యంలో సీతంపేట, భామిని మండలం బత్తిలి వద్ద కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్టు డీఎస్పీ జీవీ కృష్ణారావు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రాలో ఎన్నికల పోలింగ్ జరిగినా కౌంటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. ప్రజలు ఎటువంటి తగాదాలకు, బెట్టింగ్‌లకు పాల్పడవద్దని ఆయన సూచించారు. తగాదాలకు పోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

కోటదుర్గమ్మను దర్శించిన ఏఎస్పీ



కోటదుర్గమ్మ ఆలయంలో ఏఎస్పీ

పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్ ఆదివారం పాలకొండలోని కోటదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళిలకు సబ్ డివిజన్‌లోని శాంతిభద్రతలపై అడిగి తెలుసుకున్నారు. పలు జిల్లాల్లో ఎన్నికల తర్వాత జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారితో పాటు పాలకొండ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

చిత్రలేఖనంపై అవగాహన

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం కొనసాగుతోంది. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి పిల్లలకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. పెన్సిల్ ఆర్ట్, రంగులు ఎలా వాడాలో వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్, పాఠకులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

గజపతినగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.జయింతి ప్రసాద్ ఆదివారం తెలిపారు. మండల శాఖ అధికారులతో పాటు మండల ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. మండల అధ్యక్షురాలు బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన ఈ సమావేశం జరగనున్నట్టు తెలిపారు.

మామిడిపల్లిలో దేశమ్మ వారోత్సవాలు



దేశమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్థులు

సాలూరు రూరల్: మామిడిపల్లిలో ఆదివారం దేశమ్మతల్లి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ పొలిమేర వద్ద ఉన్న అమ్మవారి వద్దకు ఊరేగింపుగా వెళ్లి, పసుపు, కుంకుమలు సమర్పించారు. వర్షాలు కురవాలని దేశమ్మ వారోత్సవాలు నిర్వహించగా యాధృచ్ఛికంగా వర్షం కురవడం విశేషం.

గతుకుల రహదారికి మోక్షం



ఉద్యాన కళాశాలకు వెళ్లే రోడ్డులో బీటీ రహదారి వేసిన దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం సముదాయం నుంచి ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలకు వెళ్లే రహదారి గతంలో గతుకులతో అధ్వానంగా ఉండేది. గత కొన్నేళ్లుగా ఈ మార్గం గుండా ఉద్యాన కళాశాల సిబ్బందితో పాటు పార్వతీపురం మండలం పిన్నింటిరామినాయుడువలస గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో అడుగడుగునా గోతులే దర్శనమిచ్చేవి. అయితే సార్వత్రిక ఎన్నికల పుణ్యమా అని సీతారాంపురం నుంచి ఉద్యాన కళాశాల వరకు ఉన్న మూడు కిలో మీటర్ల రహదారి మెరుగుపడింది. మన్యం జిల్లాకు చెందిన నాలుగు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలను కళాశాల ప్రాంతంలో వెలువడనున్నాయి. జూన్ 4న నిర్వహించనున్న లెక్కింపునకు అధికారులకు ఇబ్బందులు నెలకొనకుండా ఉండేలా ప్రభుత్వ యంత్రాంగం రహదారిని మెరుగుపర్చింది. ఉద్యాన కళాశాల సిబ్బందితో పాటు ప్రజలు ఎన్నికల పుణ్యంతో రహదారి మెరుగుపడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మునిగుడ సమితిలో ఏనుగుల సంచారం

ఒడిశా

రాయగడ: అంబోదల మునిగుడి సమితి పరిధి పూర్ణపాణి అటవీ ప్రాంతంలో 22 ఏనుగులు ప్రవేశించినట్టు మునిగుడ అటవీ శాఖాధికారి సురేష్ చంద్ర పాత్ర ఆదివారం తెలిపారు. వెంటనే ఆయన ఫారెస్ట్‌గార్డులను అప్రమత్తం చేసి ఏనుగుల కదలికలపై నిఘా పెట్టారు. ఏనుగులు పూర్ణపాణి, భుజంగ, మాలింగ అటవీ ప్రాంతల మధ్య సంచరిస్తున్నట్టు చెప్పారు. దీంతో ఆయా ప్రాంత ప్రజలు ఎప్పుడు ఏనుగుల గుంపు గ్రామలపై పడుతుందో అని భయంతో వణుకుతున్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని ఫారెస్ట్ సిబ్బంది వాటి కదలికలపై దృష్టి సారించామని పాత్ర తెలిపారు. ఏనుగులకు ఎలాంటి విద్యుదాఘాతం కలగకుండా విద్యుత్ శాఖాధికారులను కోరినట్టు వివరించారు. ఫారెస్ట్‌గార్డులు, పితంబర్‌గౌడో, బలరాం బొంచ్, ప్రలయ దండపాణి, గౌరవ్‌పాత్ర, సనోబుడ నాయక్ తదితరులు నిరంతరం ఎనుగుల కదలికపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఏనుగుల గుంపులో 13 ఆడ ఏనుగులు, 7 గున్న ఏనుగులు, 2 మగ ఏనుగులు ఉన్నట్టు ఆయన వెల్లడించారు. అటవీ ఫలాలు సేకరించేందు కు ఎవరూ అయా ప్రాంతాల వెళ్లవద్దని గిరిప్రజలను ఆయన అప్రమత్తం చేశారు.



పూర్ణపాణి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

శిథిలావస్థలో బస్‌షెల్టర్లు

● ఎండలోనే ప్రయాణికుల నిరీక్షణ

● స్పందించని అధికారులు



వీరఘట్టం: శిథిలావస్థకు చేరిన రేగులపాడు బస్‌షెల్టర్



భోగాపురం: ప్రమాదకరంగా ఉన్న బస్‌షెల్టర్



వీరఘట్టం: ఎండలో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

భోగాపురం: మండలంలోని భోగాపురం నుంచి ముక్కాం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి సమీపంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన బస్సుషెల్టర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని సంవత్సరాల కిందట ఏర్పాటుచేసిన ఈ బస్‌షెల్టర్లు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరి, కూలిపోయే స్థితిలో ఉన్నాయి. ఆటోల కోసం వేచిచూసే ప్రయాణికులు ఈ శిథిల బస్‌షెల్టర్లలోనే ఉంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన బస్‌షెల్టర్లను తొలగించి, నూతనంగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ● **వీరఘట్టం:** మండలంలోని రేగులపాడు సెంటర్‌లో ఉన్న బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రయాణికులు రోడ్డుపైనే వాహనాల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రేగులపాడు, హుస్సేన్‌పురం, కత్తులకవిటి గ్రామాల నుంచి పార్వతీపురం, శ్రీకాకుళం, వీరఘట్టం పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ఈ సెంటర్‌కు వచ్చి ఇక్కడ నుంచి బస్సులపై వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సుషెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆ భవనాలు పూర్తయ్యేదెప్పుడో?

● భద్రగిరి 50 పడకల ఆసుపత్రికి కలగని మోక్షం

● వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వైద్యులు, రోగులు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంత ముఖ్య కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో ఉన్న భద్రగిరి 50 పడకల ఆసుపత్రికి కనీస సౌకర్యాలు లేక వైద్యులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్ల కిందట సుమారు ఏడు కోట్ల రూపాయల వ్యయంతో నూతన భవన నిర్మాణానికి అప్పటి ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్లు ఈ భవన నిర్మాణాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించారు. పనులు ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా నేటికీ భవన నిర్మాణాలు పూర్తికాలేదు. సకాలంలో నిధులు చెల్లించనందున సంబంధిత కాంట్రాక్టర్ ఈ భవన నిర్మాణాన్ని మధ్యలో ఆపి వెళ్లిపోయాడు. ఈ భవన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితుల్లో ఉంది. భద్రగిరి 50 పడకల ఆసుపత్రికి పేషెంట్ల సంఖ్య రానురాను అధిగమవుతోంది. తగినన్ని బెడ్లు లేనందున ఒక బెడ్‌పై ఇద్దరిని ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూర్తి స్థాయి వస్తువులు ఉంటే మెరుగైన వైద్యాన్ని అందిస్తామని వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆసుపత్రి అదనపు భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఈ ప్రాంత గిరిజన ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే, స్కానింగ్, వివిధ రకాల రక్త పరీక్షలకు, పేషెంట్లు ఉండడానికి, ఓపీ చూడడానికి మరిన్ని వస్తువులు కల్పించాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు.

వినతులు అందించినా ఫలితం లేదు

భద్రగిరి ఆసుపత్రి అదనపు భవన నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి వైద్యశాల మెరుగుపర్చాలని సంబంధిత అధికారులు, ప్రతినిధులకు కోరినా ఫలితం లేదు. అదనపు భవనాలు లేకపోవడం వల్ల వైద్యులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి.

- కొలక అవినాష్, గిరిజన సంఘం నాయకుడు



అర్ధాంతరంగా నిలిచిన భద్రగిరి ఆసుపత్రి భవనాలు

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



భోగాపురం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నెల్లిమర్లలో..



ఎస్.కోట సీహెచ్‌సీలో



బాడంగి మండల కేంద్రంలో..

భోగాపురం: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన చెందాలని ఐసీటీసీ కౌన్సిలర్ పుష్పారావు, లేబరేటర్ ఇన్‌చార్జి రామకృష్ణ అన్నారు. సుందరపేట సమీప సీహెచ్‌సీ ప్రాంగణంలో ఐసీటీసీ మెడికల్ అధికారి శాలిని, సీహెచ్‌సీ వైద్య అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** నెల్లిమర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ ఎయిడ్స్ స్మృత్యంజలి దినాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యుడు ఎల్.వినోద్‌కుమార్ నిర్వహణలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పునీతా పద్మావతి, ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.తవుడు, స్టాఫ్‌నర్స్ భారతి, మిమ్స్ జనరల్ ఆసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం.రాంబాబు, చైతన్యభారతి ఎన్జీవో ప్రతినిధి దుర్గ, సత్యవతి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** ఎస్.కోట సామాజిక ఆసుపత్రిలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ ఎయిడ్స్ కాండిల్‌లైట్ స్మారక దినోత్సవం నిర్వహించారు. వైద్యుడు ఉదయ్‌కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్ హరి తదితరులు ఉన్నారు. ● **బాడంగి:** ఎయిడ్స్‌తో అసువులు బాసిన వారిని గుర్తుచేసుకుంటూ అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ స్మారక దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. వైద్యులు పెద్దింటి నాగేశ్వరరావు, ఐసీటీసీ కౌన్సిలర్ భానుమూర్తి, సోమేశ్వరరావుతోపాటు వైద్య సిబ్బందితో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చైతన్య భారతి స్వచ్ఛంద సంస్థ హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం అందజేసింది. వైద్య సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

కారు, బస్సు ఢీ



బస్సు, కారు ఢీకొన్న దృశ్యం

పార్వతీపురం రూరల్: కారు, బస్సు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల ప్రధాన రహదారి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పార్వతీపురం వైపు వస్తున్న కారు అడ్డాపుశీల రహదారి వద్ద ప్రమాదవశాత్తు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఒకవిధంగా చెప్పాలంటే పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారని చెప్పుకోవచ్చు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జంఝావతి కాలువలో మృతశిశువు

పార్వతీపురంటౌన్: పట్టణ శివారులోని గిజబ కాలనీ సమీపంలో ఉన్న జంఝావతి కాలువలో ఆదివారం ఉదయం మృతశిశువు కనిపించడంతో స్థానికులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సంతోషి వెంటనే జంఝావతి కాలువ వద్దకు చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నెలలు నిండకముందే పుట్టడం వల్ల మృతి చెందినట్లు ఆరోగ్య సిబ్బంది తెలియజేశారని చెప్పారు. మృతశిశువును ఇలా కాలువలో పడేయడం సరికాదని, దర్యాప్తు నిర్వహించి, అలాంటి వారిపై కఠిన చర్యలు చేపడతామని చెప్పారు.

కోడిపందెం రాయుళ్లకు జైలు

నెల్లిమర్ల: జగ్గరాజుపేట గ్రామ శివారుల్లో కోడి పందెం ఆడుతూ దొరికిన ఏడుగురికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు నెల్లిమర్ల ఎస్ఐ రామగణేష్ ఆదివారం తెలిపారు. గత నెల 9న జగ్గరాజుపేట శివారులో నిర్వహిస్తున్న కోడిపందెంపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఏడుగురు నిందితులను పట్టుకుని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.7500 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరికి మూడు రోజుల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.50 జరిమానా విధిస్తూ విజయనగరం ప్రత్యేక జెఎఫ్‌సీఎం(ఎక్సైజ్) కోర్టు న్యాయమూర్తి ఎం.శ్రీనివాసరావు తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

ఉరుములు మెరుపులతో భారీ వర్షం

● ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

● పలుచోట్ల పిడుగుపాటు



సాలూరు రూరల్: సాలూరులో కురుస్తున్న వర్షం



పార్వతీపురంటౌన్: పట్టణంలో..

సాలూరు రూరల్: సాలూరు ఏజెన్సీలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సాలూరు అర్బన్, రూరల్‌లో పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ● **పార్వతీపురంటౌన్:** పట్టణంలోని ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సాయంత్రం 5 గంటల సమయంలో కాలేటి వారి వీధిలోని ఎంపీ రాఘవేంద్రరావు ప్రాంగణంలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. దీంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతు లకు గురయ్యారు. ● **వీరఘట్టం:** మండలంలోని ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు పలు చెట్లు నేలకొరిగాయి. దీంతో వీరఘట్టం-పార్వతీపురం రహదారిపై పడిన చెట్లను విద్యుత్ శాఖాధికారులు పోలీసుశాఖ సహకారంతో తొలగిస్తున్నారు. ఈదురు గాలులకు చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ పక్రుద్దీన్, విద్యుత్‌శాఖ సిబ్బంది వీటిని పునరుద్ధరించేందుకు కృషి చేశారు. ● **కొమరాడ:** ఎండల వేడికి విలవిలలాడుతున్న ప్రజలు శనివారం, ఆదివారం పడిన వర్షానికి కాస్త ఉపశమనం పొందారు. మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఉపశమనం పొందారు.





వీరఘట్టం: ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం, రోడ్డుపై పడిన చెట్టు



కొమరాడలో కురుస్తున్న వర్షం

కొండల్లో విరిసిన హరివిల్లు

సాలూరు రూరల్: ఏవోబీలో కొఠియా కొండల్లో ఆదివారం సాయంత్రం హరివిల్లు కనువిందు చేసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏవోబీ కొఠియా గ్రూపు పట్టుచెన్నూరు, ఎగువ మెండంగి తదితర కొండల్లో భారీ వర్షం కురిసింది. అనంతరం ఎగువ మెండంగి వద్ద పచ్చని కొండల్లో హరివిల్లు దర్శనమిచ్చింది.

మెండంగి కొండల్లో దర్శనమిస్తున్న హరివిల్లు

